
# ఘల్లు-ఘల్లు

ఎ.రామలక్ష్మి

ఎండలు తగ్గి పోయాయి. వర్షాలు మొదలయ్యాయి. సాయంత్రం ఐదు గంటల కల్లా నల్లని మబ్బులు నాలుగు వైపులా కమ్ముకుని వచ్చాయి. ఆకాశంలో కొంగలు గుంపులు గుంపులుగా ఎగురుతూ ఉంటే జెండాలు రెపరెప లాడుతున్నట్లు కన్పిస్తున్నాయి. చీకటి ముసురు కున్నట్ల యింది. స్కూటర్ వేగాన్ని పెంచాడు వేణు. వెనుక సీట్లో తడిసి....చలికి వణుకుతున్న హేమ వైపు ఒకసారి చూసి. ఇంకా ఇల్లుచేరడానికి కి.మీ దూరం ఉంది ఫెళఫెళమని ఉరుములు, మెరుపులు పిడుగులు పడినట్లయింది. వర్షం ఉధృతం ఎక్కువగా ఉంది. ఇంటి ముందు స్కూటర్ స్లో చేశాడు.


హేమదిగి గేట్ తీసింది. స్కూటర్ బాల్కనీలో పెట్టి కవరు వేసి వచ్చేసరికి ఇంటి తలుపులు తీసింది. ఇద్దరూ ఆఫీసులో పనివల్ల అలసిపోయారు. పైగా వర్షానికి బాగా తడిసినందువల్ల ఎవరైనా వేడిగా టీ చేసి ఇస్తే హాయిగా తాగి కాసేపు రిలాక్స్ అవుదామా అన్నట్లుంది వాళ్ళ మూడ్. షూస్ విప్పటానికి కుర్చీలో కూర్చుంటూ హేమా త్వరగా టీ చేసి తీసుకురా అని జివ్వు జివ్వు మంటున్నాయి చేతులు. చలి చలి అంటోంది ఒళ్ళు. అని పాట మొదలు పెట్టాడు వేణు.



హేమ మనసులో ఉబికిన కోపం వాక్ప్రవాహంలా మారింది. 'అరె నాతో పాటేతనూ ఆఫీసు నుంచి వచ్చింది కదా. కొంచెం సహాయం చేద్దామని అనుకోవడం లేదు. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే టీ నేనే చెయ్యాలా? ఏం నేను మాత్రం ఆఫీసులో కష్టపడడంలేదా మీతో సమానంగా సంపాదించడం లేదా?' అంది కోపంగా వేణు మాట్లాడలేదు. 'ఇదొక్కటి తెవిలుసు నోరెత్తకుండా, మాట్లాడకుండా కూర్చోవటం' తనకీ టీ తాగాలని ఉండడం వల్ల హేమ వంటింట్లోకి వెళ్ళింది. ఆమె టీ చేసే ప్రయత్నంలో గిన్నెల చప్పుళ్ళతో పాటు ఆమె విసుర్లు కూడా వేణుకు వినిపిస్తున్నాయి' పోనీ పనిరాదా అంటే బ్రహ్మాండంగా వంట చెయ్యడం వచ్చని కోతలు మాత్రం కోస్తుంటారు. వంటింట్లో పని చెయ్యడంలో నిమగ్నురాలైంది హేమ.

నిజమే!... పెండ్లికాక ముందు నలుగురు, ఐదుగురు స్నేహితులం కలిసి ఆఫీస్ దగ్గరగా రూం తీసుకొని ఉండే వాళ్ళం హోటల్‌లో రోజూ తినడానికి జీతం చాలక అవస్థ పడేవాళ్ళం. మామూలు మెస్ తిండి రుచించేది కాదు. చివరకు విసిగిపోయి స్వయంగా వంట చేసుకోవడానికి నిర్ణయించుకున్నాం మొదట్లో రుచిగా లేక పోయినా తర్వాత తర్వాత వంట బాగా కుదరసాగింది. తలా ఓపని చేసుకుపోయేవాళ్లం పొద్దున సాయంత్రం పని నలుగురి మీద పని కనిపించేది కాదు. పని ముగించుకొని చిన్న పిల్లలకు ట్యూషన్స్ చెప్పేవాళ్ళం. తర్వాత అలా షికార్లు, ఆదివారం సినిమా హాళ్ళలోనూ స్నేహితుల ఇళ్ళలోనూ కులాసాగా కాలం గడిచిపోయేది. వేణుని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ '...ఇదిగోండి టీ!' అంటూ హేమ గొంతు వినిపించింది. టీ రుచి హేమ మూడ్ లానే ఉంది. వేణు ఏమీ మాట్లాడకుండా టీ తాగేశాడు. హేమ టీ తాగేసి రెండు కప్పులు తీసుకుని వంటఇంట్లోకి వెళ్ళింది. ఒక బ్యాగ్ అవసరమైన కొన్ని సరకుల పట్టీ వ్రాసి వేణుకు ఇచ్చింది. 'అలాగే వస్తూ వస్తూ కొన్ని కూరగాయలు తీసుకొని రండి. ప్రొద్దున్నే లేవాలంటే బద్ధకిస్తారు. త్వరగా వెళ్ళి వచ్చేయండి అంది. స్కూటర్ స్టార్ట్ చేసి వెళ్తున్న వేణులో ఆలోచనల పరంపర మొదలైంది. ఎలాగో కూరగాయలు, సరకులు తెచ్చి టీవీ కార్యక్రమాలు చూస్తూ ఉండిపోయాడు వేణు.

రాత్రి వంట ముగించి టేబుల్‌పై అన్నీ సర్ది వేణును భోజనానికి పిలిచింది హేమ ! భోజనం దగ్గర "సాయంత్రం నువ్వు అన్నది నిజమే హేమ. పెళ్లి అయినతర్వాత నేను చాలా స్వార్థంగా ప్రవర్తించాను. బాధ్యతలన్నీ నీవి, హక్కులన్నీ నావిగా వుండకూడదు.




అందుకే అన్నారు మన కవులు "కార్యేషు దాసీ, కరణేషు మంత్రి, రూపేచ లక్ష్మీ క్షమయాధరిత్రీ, భోజ్యేషుమాత, శయనేషు రంభ షట్కర్మయుక్తా కులధర్మ పత్నీ" అంటూ భార్యకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో వివరించారు. ఒక్క మోక్షసాధనలో తప్ప మిగిలినవాటిల్లో భార్యతో సహకరించవలసిందే నన్నారు. ఇద్దరం సంపాదించితేకాని జరగని ఈ రోజుల్లో ఈ భేదాలకు తావు ఇవ్వకూడదని అనిపించింది. అందుకే అన్ని విషయాల్లోనూ ఇక నుంచి "సగం—సగం" నిజాయితీగా అన్నాడు వేణు. హేమ ముఖం వికసించింది. "నువ్వు చెప్పినట్లుగా నాకు వంటపని, ఇంటి పనీ అన్నీ వచ్చు. ఇప్పటినుంచి ఒక వారంపని మొత్తం నువ్వు చెయ్యి. ఒక వారంపని మొత్తం నేను చేస్తాను.

అలాగే ఇంటి ఖర్చుకూడా సమంగానే ఖర్చుచేద్దాం. అయినా నా జీతం కంటే, నీ జీతం ఎక్కువనుకో అయినాసరే. సమానంగా ఖర్చు చేద్దాం ! నీవు ఇంటిపని గురించే చెప్పావు. కానీ నా ఉద్దేశ్యంలో నేనే ఎక్కువ ఖర్చు చేస్తున్నానేమో అన్న అనుఉమానంగా వుంది. సినిమాలకు, సిగరెట్లకు ఖర్చు ఎక్కువే అవుతోంది... నిజాయితీగా చెబుతున్న వేణు మాటలను హేమ ఆనందం పట్టలేక...'కరక్టే ఇన్నాళ్లకి ఆలోచించారు' అంది. చేతులు కడుక్కుంటూ "ఆఁ...మరోమాట మా ఫ్రెండ్ ట్రైనింగ్‌కు అని మద్రాసు వెళ్తున్నాడు. వాడి స్కూటర్ తెచ్చి నీకిస్తాను. ఎందుకంటే మీ ఆఫీసుముందు అయిపోతుంది కదా" నేను వచ్చేదాకా వెయిట్ చెయ్యడం ఎందుకు? మనం కలిసే రావచ్చు హాయిగా ! ఇంటికి ముందు వచ్చినాసరే పని ఏమీ చెయ్యవద్దు. ఇంటిపనీ, ఇంటిఖర్చు అన్నీ సమంగానే స్వీకరిస్తాను. ఓ.కే. అన్నాడు వేణు.

ఆనందం అవధులు దాటిన హేమ వేణు దగ్గరగా వచ్చి "ఏమండీ...మీరెంత మంచివారండి. మా ఫ్రెండ్స్ భర్తల్ని చూశాను. వాళ్లలో అస్సలు హెల్పింగ్ నేచరే లేదండి !" అసలు వాళ్లు భార్యలకు కొంచెమైనా సహాయం చెయ్యరట. సంతోషంలో ఏదేదో చెప్పుకుపోతూ వుంది హేమ. వేణు చిరునవ్వు నవ్వుతూ ఊరుకున్నాడు. మర్నాడు ప్రొద్దున హేమ బద్ధకంగా నిద్రలేచింది. నిద్రలేచేసరికి, వంటఇంట్లో శబ్దం వినిపించింది. హేమ చాలా సంతోషపడింది. ముందు తన ఇంటిని చక్కబెట్టి తన ఫ్రెండ్స్ భర్తలకీ బుద్ధి చెప్పవచ్చు. అనుకుంది. హేమ ముఖం కడుక్కొని వచ్చేసరికి వేణు కాఫీ అందించి తనూ తాగుతూ పేపర్ చదవటం మొదలుపెట్టాడు.

'కాఫీతోనే సరిపెట్టాలనుకుంటున్నారా? పేపర్ చదువుతూ కూచుంటే వంట ఎవరు చేస్తారు" అంది హేమ. వేణు పేపర్‌లో నుంచి తల తియ్యకుండానే మాట్లాడాడు. "అనుమానం ముందు పుట్టి ఆడవాళ్లు తరవాత పుట్టారంటారు. నేను పనిమొత్తం చేస్తాను అని చెప్పిం తర్వాత చెయ్యనని ఎలా అనుకున్నావు. కుక్కర్లో అన్నం, పప్పు పెట్టాను. అది విజిల్ రాగానే వెళ్తాను. ఈలోపు పేపర్ చదవటం అయిపోతుంది !

హేమ మాట్లాడలేదు. హేమ ఆఫీసుకు రెడీ అయి గుమ్మం దగ్గరకు వచ్చేసరికి రెండో స్కూటర్ కూడా పోర్టికోలో కన్పించింది. అబ్బా ! అంతా పకడ్బందీగానే చేస్తున్నాడే.... సర్లే... నాల్గు రోజులు పని చేస్తే తెలిసి వస్తుంది అనుకుంది. ఆఫీసుకు బయలుదేరే ముందు "హేమా ! నువ్వు స్కూటర్ మీద వెళ్లలేకపోతే చెప్పు నేనే దింపుతాను? అన్నాడు వేణు. హేమకు పౌరుషం ముంచుకొచ్చింది, "అవసరం లేదు. నాకు స్కూటర్ డ్రైవింగ్ అలవాటే' అంది. ముక్తసరిగా నాల్గు రోజులు గడిచాయి. ప్రొద్దున పాల ప్యాకెట్ తీసుకురావడం దగ్గర నుంచి, రాత్రి భోజనం చేసే వరకు అన్ని పనులు వేణునే చేస్తున్నాడు. అతని ముఖంలో అలసట స్పష్టంగా కనిపిస్తోంది. కానీ పైకి చిరునవ్వుతో అలసట కనిపించకుండా తిరుగుతున్నాడు. హేమకు స్కూటర్ డ్రైవింగ్ కష్టంగా ఉన్నా ఇంట్లో పని ఏమీ లేకపోయేసరికి హాయిగా ఉంది. భర్త మీద జాలి వేసింది కూడా. కాస్త పొగిడితే రిలీఫ్‌గా ఉంటుందేమోనని, 'పాపం మిమ్మల్ని చూస్తే బాధగా ఉందండి ఆడవాళ్ల కంటే సునాయాసంగా పనంతా చేస్తున్నారు. వంట కూడా రుచిగా ఉంది. వెరీ గ్రేట్ !' ఆమె మాటలకు అడ్డువస్తూ వేణు నవ్వి 'ఇదెంత పని ఇంట్లో గ్యాస్, కుక్కర్, మిక్సీ అన్నీ ఉన్నాయి. పని మనిషి ఉంది. ఇద్దరికి వంట ఎంత సేపు పెండ్లి కాక ముందు మా ఫ్రెండ్స్‌తో రూమ్‌లో ఉన్నప్పుడు కిరసనాయిల్ స్టవ్‌తో వండి నానా అవస్థలు పడి వండుకునే వాళ్ళం.

ఉద్యోగం పోయినా వంటలు చేసుకుని బ్రతకొచ్చని జోక్ చేసుకునే వాళ్లం !" అన్నాడు వేణు. నాల్గు రోజుల తర్వాత ఇద్దరికీ జీతాలు వచ్చాయి. 'నా జీతం పదిహేను వందలు బీరువాలో పెడుతున్నా ఇంటి ఖర్చుకీ, మిగతావి నా ఆఫీసు ఖర్చులకీ, చిన్న చిన్న సరదాలకూ' అన్నాడు వేణు. డబ్బు బీరువాలో పెట్టగానే హేమ కూడా పదిహేను వందలు బీరువాలో పెట్టి ఫరవాలేదు. నా సొంత ఖర్చులకి 600 రూ. మిగిలాయి అనుకుంది. మర్నాడు ఇంటి యజమాని వచ్చి ఇంటి అద్దె, కరెంట్, నీళ్ళకు అని వెయ్యి రూపాయలు తీసుకువెళ్లాడు. పని మనిషి వంద రూపాయలు జీతం తీసుకు వెళ్ళింది. వేణు వెలకు సరిపడ కిరాణా సామాన్లు తెచ్చాడు. అందులోనే తన అలంకరణ సామాగ్రీ ఉంది. ఆ రాత్రి భోజనం చేస్తూ 'నేటి నుంచి నువ్వు పని చేయాలి' అన్నాడు వేణు. 'గుర్తుంది !' అంది హేమ. మర్నాడు ప్రొద్దున లేచి పనులు మొదలు పెట్టింది హేమ. వారం రోజులుగా తప్పిపోయిన పని విసుగుగా ఉంది. ఆదరాబాదరాగా పని పూర్తి చేసిన హేమకు స్కూటర్‌ను చూడగానే నీరసం వచ్చింది. అబ్బా ! ఈ ట్రాఫిక్‌లో పది కిలో మీటర్లు నడపాలా? అమ్మా వాళ్ల దగ్గర ఉన్నప్పుడు ఆఫీసుకు దగ్గరలోనే ఉండేది ఇల్లు. అలా జాలీగా స్కూటర్ మీద వెళ్లి వచ్చేదాన్ని గతవారం ఇంటి పని మొత్తం ఆయన చేయడం వల్ల స్కూటర్ డ్రైవింగ్ కష్టమనిపించలేదు. ఇపుడు ఎలాగురా బాబూ ! అనుకుని లేని ధైర్యం తెచ్చుకొంది. హేమ. నాల్గు రోజుల్లో అలవాటైపోతుంది. పని చేస్తే ఇంకో వారం రెస్టు తీసుకోవచ్చు. మగవాళ్ళు, ఆడవాళ్ళు సమానమే అని చాటి చెప్పాలంటే కొంత కష్టం తప్పదు.

స్కూటర్ స్టార్ట్ చేసి కొంత దూరం వెళ్లేసరికి పెట్రోల్ రిజర్వ్‌లోకి వచ్చేసింది. పెట్రోలు నాలుగున్నర లీటరు పట్టింది. ఇన్నాళ్లు పెట్రోలు ధర తెలుసుకోవలసిన అవసరం కల్గ లేదు. వంద రూపాయలు బంకువాడికి ఇచ్చి ఆఫీసుకు వెళ్లేసరికి లేటు మార్కు పడింది. సాయంత్రం వేణు ఇంటికి వస్తూనే 'హేమా కాఫీ తీసుకురా' అన్నాడు. హేమకు తలనొప్పిగా ఉంది. కాఫీ చేసి ఇద్దరికీ తెచ్చింది. కాఫీలో పాలు ఎక్కువ పంచదార తక్కువ. వేణు ఏమీ అనలేక ఊరుకున్నా అతని ముఖంలో విసుగు కనిపించింది. రోజులు గడుస్తున్నాయి. హేమకు స్కూటర్ నడపటం విసుగ్గా ఉంది. పోనీ ఆయన్ని అడుగుదామా ఆఫీసు దగ్గర దించమని....ఓడిపోయినట్లవుతుంది. ఆలోచనలో ఉన్న హేమ దగ్గరకు కొలీగ్ వచ్చి హేమా ! ఈ రోజు మన లేడీస్ అంతా కలిసి సరదాగా హోటల్‌కు వెళ్లాలని



పాలు తాగేటప్పుడు పిల్లి కళ్ళు మూసుకుంటుంది. ఎందుకంటావురా? అని అడిగాడు రాము.

పాలలో చేసిన 'కల్తీ చూడలేక' చెప్పాడు తమ్ముడు సుబ్బారావు.

మోర్తాడ్ —అబ్దుల్ గఫ్ఫార్

నిశ్చయించాం. బయలుదేరమని తొందర చేసింది. హేమ హ్యాండ్ బ్యాగ్ తీసి చూసింది. అందులో 20 రూపాయలు మాత్రమే ఉన్నాయి. గుండె గుభేలు మంది. ఎదురుగా క్యాలెండర్ 26వ తేదీ చూపిస్తోంది. ఇంకా ఆరు రోజులు గడవాలి. ఇపుడెలా అని ఆలోచించసాగింది. అంతలో కొలీగ్స్ వచ్చి వెళదామనడంతో వెళ్లక తప్పలేదు. హేమ రోజులు గడిచిన కొద్దీ తనలో తను మదనపడసాగింది. తను పని చేసే వారం అంతా అలసటగా ఉంటోంది. దీనికి కారణం స్కూటర్ నడపడమేనా అనుక్షణం ఏవైపు నుండి ఏ బండి వస్తుందోనన్న టెన్షన్‌లో నడపటం ఎంత కష్టం. హేమకు ఇంకో ఆలోచన వచ్చింది. ఈ "సగం — సగం" పంపకం ముందు ఇంట్లో వేణు కొంత పని చేసే వాడు. అందువల్ల శ్రమ తెలిసేది కాదు. వేణు ఓ కప్పు టీ అడిగేసరికి నాకెందుకో కోపం వచ్చింది. హేమ ఆలోచన తెగ లేదు. ఆ రాత్రి హేమ వేణుతో.... "రేపటి నుంచి రోజూ వంట మొత్తం నేనే చేస్తాను. ఏ మాత్రం విసుక్కోను కూడా !" అంది. వేణు ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు. 'మీరు ఇదివరలో చేసే పనులు వాటిలో కష్టం నాకు తెలీ లేదు. వంట చెయ్యడం కన్నా స్కూటర్ నడపడం కష్టం. వంటలో చిన్న పొరపాట్లు జరిగినా ఫరవాలేదు కానీ అదే రోడ్డు మీద చిన్న తప్పు అయినా ప్రాణాంతకం కదా? అది వరకు నేను పని చేస్తుంటే కొంత సహాయం చేసే వాళ్లు. మొత్తం పని భారం నా మీదపడే [illegible] తెలిసింది. మీ సినిమాలు, సిగరెట్ల క[illegible] చీరలకు సింగారాలకే ఖర్చు ఎక్కువ. ఈసారి పండుగ చీరకి కూడా డబ్బు మిగలలేదు. హేమ గొంతులో జీరవినిపించింది. వేణు మాట్లాడకుండా లేచి వెళ్లి బీరువా తీసి ఒక ప్యాకెట్ తీసి చేతిలో పెట్టాడు. హేమ అది విప్పి చూసింది. ఆశ్చర్యం కొత్త చీర కనీసం వెయ్యి రూపాయలు ఉండవచ్చు. ఆమె తబ్బిబ్బుతో 'చీరకు డబ్బెక్కడిదండి అంది' 'ఇంటి ఖర్చుకుపోనూ నా జీతంలో కొంత నేను ఉంచుకునే వాణ్ణిగా.... అందులో నుంచి కొన్నాను'. అంటే వేణుకి సొంత ఖర్చులు చాలా తక్కువ అన్నమాట. తన జీతం కన్నా అతని జీతం తక్కువ. అయినా మిగిల్చగలిగాడు. ఆశ్చర్యంగా ఉందే !

చూడు హేమా : మన పెండ్లికి ముందు నువ్వు మీ అమ్మ, నాన్న దగ్గర హాయిగా ఉండేదానివి. ఇంటి ఖర్చు మీ నాన్న చూసుకునేవాడు. ఇంటి పని మీ అమ్మ చూసుకునేది. నాకు ఉద్యోగం వచ్చిన నాటినుంచి రూమ్ రెంట్. భోజనం ఖర్చు అన్నీ పెట్టుకుంటూ ఇంటికి డబ్బులు పంపించేవాణ్ణి. అందుకే పని విషయంలో కాని, ఖర్చు విషయం లో కాని. బాధ్యత పంచుకోవడం నాకు కష్టంగా లేదు. హేమ అర్థం చేసుకున్నట్లుగా అతనివైపు చూసింది. అసలు మీ ఆడవాళ్లలో, మగవాళ్ళు రాక్షసులనీ, వాళ్లకి స్వార్థం చూసుకోవడం తప్ప మరొకటి రాదని ఆడవాళ్లని బానిసలుగా చూస్తున్నారనే భావం పేరుకుపోయింది. నేను నిన్ను కాఫీ అడిగితే — నిన్ను బానిసలా చూశానని నీకు అనిపించింది. నువ్వు స్కూటర్ మీద వెనుక కూర్చుంటే నేను నీకు డ్రైవర్‌నని అనుకోవచ్చు గదా." హేమ ముఖంలో పశ్చాత్తాపం కనిపించింది. అనునయిస్తున్నట్లుగా దగ్గరకు తీసుకున్నాడు వేణు "అఫ్‌కోర్సు" మగవాళ్లలోనూ స్వార్థపరులూ వుంటారనుకో జీతమంతా విలాసాలకు ఖర్చు చేసే వాళ్ళు వుండవచ్చు. అలాగే ఆడవాళ్లలోనూ వుండవచ్చు. నిజానికి కరెక్టుగా లెక్క పెట్టుకుంటే మగవాళ్ల జీతమే ఇంటిఖర్చులకి ఎక్కువ అవుతుంది. ఆడవాళ్ళు తమ సంపాదనకి "మైమనీ" అనీభర్త సంపాదనను "అవర్ మనీ" అని అమెరికాలో కూడా అనుకుంటారట. ఎప్పుడో ఇంగ్లీషు పత్రికలో ఒక ఆర్టికల్‌లో చదివినట్లు గుర్తువస్తోంది. వేణు కాసేపు మౌనంగా ఉండి అసలు "సగం — సగం" అంటే అనుక్షణమూ అన్ని విషయాల్లోనూ అంతా సమానంగా వుందా లేదా? అని తూకం వేసుకోవడం కాదు. అటువంటి అనుమాన దృక్పథంలో సంసారం సాఫీగా నడిచే బండి కుంటుపడిపోతుంది. మొత్తానికి ఇద్దరి మధ్య సమానత్వం వుందన్నభావం మనస్సులో వుండాలి.

ప్రతి క్రియలోనూ సమానత్వం కోసం పోటీ వుండకూడదు. అనుకూల దాంపత్యానికి అర్థం అదే. హేమ అతని మాటలను పూర్తిగా అంగీకరిస్తున్నట్లు చూసింది. హేమ చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు వేణు. ఊహకు అందని ఆనందం కల్గుతున్న భావన ఇద్దరిలోనూ. ఇంట్లో ఎవరూ లేని ఏకాంతం. వాలిపోతున్న కనురెప్పలపై తన పెదవుల్ని సుతారంగా ఆన్చాడు వేణు.